# సెక్షన్ 109

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

"గార్డ్ టర్నవుట్!" 'గార్డు రూముకి' ముందు నిలబడిన 'సెంట్రీ' ఒక్క అరుపు అరిచాడు. జిల్లాసూపరెంటెండెంటు దొరగారి బాదామీరంగు 'ఫియట్ కారు' ఫిరంగి డిజైను' మలిచిన గేటులో నించీ బాణంలాగా రివ్వున దూసుకొచ్చింది. అటూ ఇటూ సిమెంటు కుండీలలో డాలియా మొక్కలు 'సెంట్రీ'కి 'సెంట్రీ'లల్లే నిశ్చలంగా పెద్దపెద్ద కళ్లు జేసుకుని కాపలాగాస్తున్నాయి. ఊచల గేటు కటూ యిటూ, ఇనపగొట్టాల రాటలు ఊతగా వేసిన వెదరు బద్దల 'ఆర్చి' మీద, ఎర్రనిబోగన్‌విల్లా తీగ నిప్పులు చెరిగిపోస్తోంది; ఎదుట పచ్చని 'లాన్' వెనక చిక్కగా విచ్చుకున్న సింగపూర్ నూరువరహాల గుత్తులు ఎవరో 'స్టెన్‌గన్' పేలుస్తున్న చిత్రాన్ని దృశ్యమానం చేస్తున్నాయి. 'వెయిటింగు'లో వున్న 'గార్డు' జవాన్లు ఆదరాబాదరా మడతటోపీలు సర్దుకుని, పటకాలు బిగించుకుని, 'ఫాలిన్' అయ్యారు.

జిల్లా 'పోలీసాఫీసులో' నెలవారీ 'క్రయిం మీటింగు' జరుగుతోంది. ఆ వేళ జిల్లాలో వున్న సర్కిలిన్‌స్పెక్టర్లూ, డిప్టీసూపరెంటులూ, అందరూ 'హెడ్‌క్వార్టర్సు'లో హాజరై గడిచిన నెలలో తీసుకున్న పోలీసు చర్యల్ని సమీక్షించుకుంటారు. దొంగ దొరకని నేరాలలో దర్యాప్తు లెందాకా కొనసాగిందీ, దొరికిన నేరాలలో ఎంతవరకూ 'ఛార్జిషీట్లు' దాఖలు చేసిందీ — ఇత్యాది సమాచారాన్ని కలబోసుకుని, ఆరాలు చూచుకుంటారు. పోలీసుల ఆచూకీ నించీ తప్పించుకుని తిరుగుతున్న పాత కేడీల ఉనికీ మనికీ, ఆనూపానూ, చర్చలో కొస్తుంది ఆ 'మీటింగు'లో. ఏ నెల కానెల, నేరా లెక్కువవుతున్నదీ, తక్కువవుతున్నదీ, బేరీజు వేసుకుందుకు అవసరమైన భోగట్టా యావత్తూ 'సర్కిల్' వారీగా సేకరించి పట్టుకొస్తారంతా. ఎక్కువవడానికి కారణాలు చీల్చిచూచుకుని దాని కవలంబించదగిన చర్యలేవో, జిల్లా సూపరెంటు దొరగారు నిర్ణయించి, సబిన్‌స్పెక్టర్లకీ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకీ సూచనలూ, సలహాలూ అందించి, ఆ మేరకి అవి అమలు జరిగేలా చూడమని డిప్టీలని ఆదేశించడం జరుగుతుంది.

'వైర్ ఫెన్సింగు' పక్కని కారాపి సూపరెంటు 'సెల్యూట్' తీసుకుంటుంటే 'బ్యాగ్లర్' 'బిగిల్' ఊదాడు. 'ప్రెజంట్ ఆరమ్స్', 'స్లోపన్ ఆర్మ్స్' అయింతరవాత 'గార్డ్ ఇన్‌ఛార్జి' 'డిస్మిస్' అన్నాడు. సూపరెంటుదొర చేతిలో పేముబెత్తం పుచ్చుకుని, చంకలో 'హ్యాట్' పెట్టుకుని చీడీల మీదకి ఒక్క దూకుదూకి 'ఆఫీసురూమ్' లోకి వెళ్లిపోయాడు. సూపరెంటు ఆఫీసుకి వచ్చినా నిష్క్రమించినా తుపాకులు పేలుస్తున్నంత హంగామా జరుగుతుంది. ఆఫీసుగదిలో చుట్టూ గోడవారగా సర్కిలిన్‌స్పెక్టర్లు కూచున్నారు. 'యస్. పి.' అంటే సూపరెంటు దొర 'టేబిలు' కటూ ఇటూ 'డిప్టీలు' కూచున్నారు. దాని మీద 'కాలింగ్‌బెల్లూ', 'పెన్‌హోల్డరూ' పెన్ కుషనూ ఒక 'పంచింగ్ మిషీనూ' వున్నాయి. గాజు కూజాలో అమిర్చిన 'జినియాలూ, కాస్మాస్ పువ్వులూ గుత్తుగుత్తులుగా 'సీలింగ్‌ఫాన్' కింద విరగబడి నవ్వుతో రంగులు కలబోసుకుంటున్నాయి.

చాలాసేపు క్రితంనెలలో జరిగిన నేరాలను గూర్చి చర్చ జరిగింది—'టవున్'లో దొంగతనా లెక్కువయినయి. ధరలు మండిపోతున్నాయి—దేశంలో దరిద్ర మెక్కువయింది. కక్కుర్తి పెరిగి ఛిల్లర దొంగతనాలు నిరాఘాటంగా సాగిపోతున్నాయి—అని సరిపెట్టుకుని చతికిలబడి కూచుందుకు ఆస్కారం లేదు 'పోలీసాఫీసర్ల'కి. మరిహను 'పోలీస్ డిపార్ట

మెంటెందుకూ? దేశంలో ఉన్నవాడూ, లేనివాడూ, ఆశలు తరగనివాడూ, ఆశలు తీరనివాడూ, కూచుని కుప్పలందుకునేవాడూ, తిరిగి తిప్పలు పడేవాడూ— అంతా—ఒకళ్ల సరసని ఒకళ్లు—ఢీ అంటే ఢీ అను కొంటూ ఉండాలిసిందే. అట్లా వుండగా, వాడి మీద వీడూ, వీడి మీద వాడూ దండయాత్ర చెయ్య కుండా, తుపాకీ మొనతో గిరిగీసి, గిరి దాటితే హంటర్ ఝళిపించాలిసిందే! దానికే 'పోలీసు డిపార్టుమెంటు!!' ఆ మాట కొస్తే, అందరికీ, చిత్తవృత్తిగా కాకపోయినా, ఏదో సంసార పక్షంగా అన్నీ అమిరిచక్కా వూరుకుంటే, నిక్షేపంగా, ఒక్క పోలీసు డిపార్టుమెంటున్న మాటేమిటి, అన్ని డిపార్టుమెంటులూ ఒక్కబిగిని ఎత్తి పారెయ్యవచ్చును. ఆమట్న నిరుద్యోగం పేరుకు పోగలదు! అమ్మయ్యో, ఉన్న పరిస్థితి ఇట్లా ఉండి పోవలిసిందే! అంచాత, దరిద్రమెక్కువై నేరాలెక్కువై పోతున్నాయన్న మామూలు సిద్ధాంతం మరుగున పోలీసులు దాక్కుందుకు వీలులేదు. ''మరింకేమి కారణాలున్నాయిరా?' అని ఊహాగానంలో కుస్తీలు మొదలయినై. రాత్రిళ్ల 'పెట్రోల్ డ్యూటీలు', 'పెట్రోల్ చెకింగులు' సక్రమంగానే జరుగుతున్నట్టు నమోదయిపోతున్నాయి 'నోట్‌బుక్కు'లోల, 'జి. డి.' లలో, 'డయరీ'లలో...

ఆఖరికి 'టవున్'లో జామీనుకేసులెన్ని పెట్ట నట్లూ అన్న మీమాంస వచ్చింది. జామీను కేసు పెట్టడమంటే, అనుమానించదగిన పరిస్థితులలో మనుషుల్ని పట్టుకుని కేసు బనాయించడం. మామూలు 'సెక్షన్ల' కింద దొంగాణ్ణి దొంగతనం చేసింతరవాత గాని 'ప్రాసిక్యూట్' చేసిందుకులేదు. 'రాత్రిళ్ల, తక్కుతో తారుతో సందుల్లో గొందుల్లో తిరుగు తున్నాడు--ఫలానిగంటకి నువ్విక్క డెందుకున్నావు? అని నిగ్గదియ్యగా, నమ్మదగిన సంజాయిషీ ఇవ్వలేదు-- దొంగతనం చెయ్యబోతున్నాడు' —అని, మనిషిని మధ్యవర్తుల 'రిపోర్టు' కింద దొరకబుచ్చుకుని, పోలీస్ లాకప్‌లో పారేసి, మన్నాడు 'సబ్‌డివిషనల్ మేజి స్ట్రేటు' కోర్టులో 'రిపోర్టు' దాఖలుచేసి కటకటాల వెనక నొక్కిపారెయ్యడానికి పనికి వస్తుంది, 'క్రిమినల్ ప్రోసీజర్ కోడ్డు 109 సెక్షన్. ఆ 'సెక్షన్' కింద ఎన్నికేసులు పెడితే, ఆ ప్రాంతంలో నేరాలంత తగ్గ స్థాయిలో ఉంటాయిరా అని పోలీసువారి మతంలో ఖచ్చితమైన సిద్ధాంతం. పైవాళ్ళకి అది ఆషామాషీ అంచనా అనిపించినా అది లెఖ్ఖలోదికాదు.

'టవున్'లో క్రితంనెలా ఆపైనెలా చాలా తక్కువగా జామీనుకేసులు పెట్టడం జరిగింది. ''అదగ్గదీ'', అని జిల్లాసూపరెంటు 'టేబిల్' మీద ఒక్కగుద్దు గుద్దాడు, కీలకం దొరికిందన్న దిలాసాలో. 'యాష్‌ట్రే' మీద గాడిలో పొందికగా వుంచిన 'స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్టు' పీక అదిరిపడింది. 'సర్కిల్' తను తీసుకొచ్చిన 'క్రయింరిపోర్టు' ఒకసారి తిరిగేశాడు. 'వన్ టవున్ యస్సయి' (అంటే సబిన్ స్పెక్టరు) జామీను కేసులేమీ పెట్టినట్టులేదు, ఈమధ్య. దాఖలు చేసినవన్నీ 'టూ' టవున్ యస్సయి పెట్టినవేను. 'సూపరెంటు' కొరకొరా చూశాడు 'డెప్టీ' వంక, ఎవరూ దీనికి బాధ్యులన్నట్లు. ఆయన ఒక చిన్నదగ్గు దగ్గి 'సర్కిల్' వంక చూశాడు. 'సర్కిలు' గొంతు సవరించుకుని, అవసరంలేని 'పెన్ను కోసం అదేపనిగా వెతికేస్తూ, ''అయ్య'' అని కాస్సేపు వీళ్ల నమిలి, ''ఏమిటయ్యా ఇదీ?'' అని పక్కనే ఉక్కిరిబిక్కిరవుతున్న 'వన్‌టవున్ యస్సయి' వంక చూశాడు, కరుగ్గా. ఉరుమురిమి మంగలం మీద పడ్డట్టు, అతగాడి పీకల మీదకి వచ్చిపడింది చివరికి.

మీటింగు ముగిసింది.

* * *

'వన్‌టవున్ సబిన్‌స్పెక్టర్' మోహనరావు ఉద్యో గానికి కొత్త. రాయవెల్లూరులో 'ట్రెయినింగ్'యి, 'ప్రాక్టికల్ ట్రెయినింగు' పూర్తి చేసుకుని ఇటీవలనే 'వన్‌టవున్ పోలీసుస్టేషన్‌కి 'పోస్టు' అయ్యాడు... 'క్రాప్‌కటింగ్' మీసకట్టయితే వాజూకుగా 'ట్రిమ్' అయివుందిగాని, ఇంకా నలుపు తిరగలేదు; లేత మొహంలో నేలమీదపడి మకిలిగాని వానచినుకులోని నైర్మల్యమింకా ఇగిరిపోలేదు; లోకాన్ని పచ్చనిరంగులో చూడమరిగిన కళ్లతో, దొంగని కూడా మనిషి క్రిందనే జతగట్టి వ్యవహరించే సుతిమెత్తని అలవాట్లింకా చూరుపట్టుకుని వేళ్లాడుతున్న సుందర సుకుమార మూర్తి.

పక్కమీద నించీ లేస్తూనే, పోలీసుస్టేషన్ నించీ జవానొచ్చి 'డెప్టీసూపరెంటు బంగాళా' నించీ

'టెలిఫోన్ కాల్' వచ్చిందని కబురు తెచ్చాడు. ఆదరా బాదరా కాలకృత్యాలు ముగించుకొని, క్రాపు నున్నగా దువ్వి, 'ఫుల్‌పాంటు' మీద 'కాకీ బుష్‌కోట్' వేసుకుని నికెల్ నక్షత్రాలు రెండూ బిగించుకుని, 'బ్యాడ్జీ' పెట్టుకుని, 'క్రాస్‌బెల్టు' వేసుకుని, 'ఫోరేజ్' క్యాప్ పెట్టుకుని, కొత్తపండక్కి అత్తారిచ్చిన 'హంబర్ సైకిల్' మీద 'డెప్టీ' బంగాళాకి ఒక్కపరుగున వెళ్లాడు. బంగళాలో సర్కిలిన్‌స్పెక్టరుగారు అప్పుడే హాజరై 'డెప్టీ'తో మాట్లాడుతున్నారు. ఇద్దరూ 'యస్సయి'ని తోమితోమి వదలిపెట్టారు జామీను కేసులు పెట్టనందుకు. ఎంత గుంజిపెట్టినా, 'యస్సయి' మోహనరావు ఒకే ఒక్క సమాధానమిస్తున్నాడు, 'తాను రాత్రిళ్లు గస్తీలలో జాగర్తగానే పరిశీలన చేస్తున్నాననీ, ఎవ్వరూ అనుమానాస్పదంగా అవుపళ్లేదూ' అని.— కేసు పెట్టాలీ అన్న సంకల్పం కలిగింతరవాత కేసు బనాయించేందుకు దారిదొరక్క తారట్లాడే 'యస్సయి'ని అదే మొదటిసారిగా చూచినట్లు ఆఫీసర్లిద్దరూ మోహనరావువంక తూట్లు పడేలా చూచినట్టేచూచి, ఆ తరవాత సాభిప్రాయంగా ఒకరివంక ఒకరు చూచుకున్నారు. ఇట్లాకాదని, 'డెప్టీ' వాదన కట్టిపెట్టి, ఒక్క నిట్టూర్పు విడిచి, "ఈ పురిపిల్ల కింకా పంజాగోళ్లు వచ్చీవచ్చిగా వున్నాయి—వేట నేర్పండి" అని 'సర్కిల్' చెవిలో ఊది, 'జీప్' మీద హడావుడిగా దొరబంగళాకి వెళ్లిపోయాడు.

*    *    *

'యస్సయి' తిన్నగా పోలీసుస్టేషను కొచ్చిపడ్డాడు. టోపీ 'టేబిలు' అంచునపెట్టి 'రైటర్' అని పిలిచాడు. 'రైటర్' వచ్చి నిలబడ్డాడు. అతగాడికి జరిగిందంతా పూసగుచ్చినట్లు వర్ణించి చెప్పి, "దొరకడంలేదు మొర్రోమంటుంటే జామీను కేసులు పెట్టుపెట్టు అంటే ఎట్లాగోయ్, ఇదేమన్నా కాఫీ సేవించడమా?—గబగబ సాసర్లో పోసుకుని, రెండు సార్లు 'సిప్' చేసి కప్పు కాళీచేసేందుకు?" అని డెప్టీ దగ్గర చెయ్యాలిసిన 'ఆర్గ్యుమెంటు' పరోక్షంగా రైటరు దగ్గర ఏకరువు పెడుతున్నాడు 'యస్సయి.' రైటరికి జరిగిందంతా తెలుసు. అంతా విని, మెడ గీరుకొంటూ, "కేసులు పెట్టాలండి మరి" అని ముక్తసరిగా సూచించి, తలపంకించి, 'యస్సయి'గారు 'సీరియస్'గా ఉన్నారని పసిగట్టి, మూతిబిడాయించుకుని నిల్చుండిపోయాడు. "ఇంతటిబోడిసలహాకనా నిన్ను పిలుస్తా?" అన్నట్టు, ఒకసారి చిరాకుగా చూచి, 'రైటర్ని' పొమ్మని పెద్దహేడ్డు రంగయ్యని పిలిపించాడు 'యస్సయి'. రంగయ్యహేడ్డు వచ్చి 'ఏటన్న'నయి నిలుచున్నాడు. గుండ్రటిమనిషి; నడుమూ, బాతీ, మెడా, మెడకాయి మీద తలకాయీ, అన్నీ గుండ్రంగా ఒకదాని మీద ఒకటి పేర్చినట్టుంటాయి, రంగయ్యహేడ్డు విగ్రహంలో. నవ్వుతో మాట్లాడతాడు; ఆ నవ్వులో నవ్వెంత వుందో, ఎద్దేవా ఎన్నిపాళ్లు రంగరించాడో తెలుసుకుందుకు ఓ పట్టాన సందివ్వడు. రంగయ్య హేడ్డుకి 'యస్సయి' గారి గుంజాటన అర్థమయింది. "ఇంకా ఉండేలు దెబ్బతినని పిల్లకాకి!" అనుకున్నాడు.

"మరి ఆ 'టూ టవున్ సబిన్‌స్పెక్టరు' చంద్రరా వెట్లా పెడుతున్నాడోయ్ 109 కింద అన్ని కేసులూ? నా కొక్కటీ చిక్కకపాయెను" అని తల పోరగాపెట్టి ప్రశ్నార్థకంగా చూశాడు 'యస్సయి' మోహనరావు.

"ఏముంది సార్—పాత నేరగాళ్లు 'జెయిలు' నించీ విడుదలయి వస్తారు కదండీ-రేత్రిళ్లు చక్కర్లు కొడుతున్నాడని కాగితం నలుపుచేసి 'రికార్డు' కెక్కించేదీ. ఆమట్న, ఏదో సందు చూచుకుని, 109 సెక్షన్ కింద నొక్కిపారేశేదీ. లేకపోతే ఛస్తామాండి? వాడు మళ్లీ దొంగతనాలకి తాపీగా ఉపక్రమించేదాకా కనిపెట్టుక్కూచుంటామాండి? దొంగాడు కన్నంవేదామని ఇంటి చుట్టూ తిరుగుతుండగా, హాజరుగా ఎవర్ని వచ్చి 109 కింద కేసు పెట్టుకోండని 'నోటీసి'స్తాడా మనకి?...అట్లా అట్లా...ఆ యిల్లా...ఇంటిచుట్టూ దొంగాడూ... వాడి జేబులో అగ్గిపెట్టె, ఒకబ్లేడూ... రెండు పెద్దమేకులూ...ఒక కన్నపుకర్రా... ఒకటేవి టండీ... 109 సెక్షన్‌కి అవసరమయ్యే సరంజామంతా జేబూ తడమగానే బైటపడ్డమూ.. సరిఘ్గా ఆ గడియలోనే 'యస్సయి'గారు గస్తీ తిరుగుతో అక్కడ తారసిల్లడమూ.. అదంతా 'సినీమారీలు' తిరిగినట్లు 'కేస్ డయురీ'లో 'రికార్డ'యితేనే తప్ప, 109 కింద కేసు ఓపట్టాన నిలిచి చావదు కదండీ. చంద్రం సబ్ ఇన్‌స్పెక్టరుగారు ఎట్లాగూ ఘటికులండి! తమరేమో

పరేసరి'' అని, తలగోక్కుని, ''చిత్తగించారూ—వచ్చిన చిక్కేమిటాండి..ఈ దొంగవెధవలు.. సాక్ష్యమూ సంపన్నమూ దొరకని సమయంలో దొంగతనాలకి దిగుతారండి... ఎవరేవా సాక్ష్యం పలికితేనేగాని కేసు నెగ్గ చావదాయిరి''. 'యస్సయి' చక్రుమన్నాడు.

''అయితే నన్ను అబద్ధపు కేసులు పెట్టమంటావుటోయ్?'' అని గద్దించాడు.

''ఓయబ్బో—చాలామందిని చూశాను--ఆరీతల నక్కకి మూడీతల నక్క ముక్కడం నేర్పుతోంది!'' అనుకున్నాడు [రంగయ్యహేడ్డు. పైకి మాత్రం, ''అమ్మమ్మ అంతమాట అనగలవాండి?'' అని సర్దుకున్నాడు.

''నేను ఛస్తే పెట్టనట్లాంటి కేసులు—మెచ్చి మేకతోలు కప్పుతారని పాపం మాట గట్టుకొమ్మంటావుటోయ్? ఉద్యోగం ఉండనీ ఊడనీ, నావల్ల, కాదుస్మీ'' అని కుర్చీకి జారగిలబడ్డాడు 'యస్సయి'.

''ఇది పోలీసు భాష కాదు'' అనిపించింది రంగయ్య హేడ్డుకి.

* * *

రాత్రి భోంచేసి కిళ్లీలు నములుకొంటో 'యస్సయి' మోహనరావూ, రంగయ్య హేడ్డూ పెట్రోలింగుకి బయల్దేరారు, 109 కింద కేసులు దొరుకుతయ్యేమోనని. 'టవున్'లో వాన అప్పుడే వెరిసింది. వాననీళ్లు జలజలా రోడ్డువారని పల్లాలు వెతుక్కుంటున్నాయి. క్రమంతెన దాటి పడమటి వీధి సందుల్లోపడ్డారు. కక్కుస్‌దొడ్ల పక్కని పందుల ముఠా, 'డైనింగ్‌హాలు' పక్కని అతిథులు విశ్రమించినట్టు, ఒకదాని కొకటి అంటిపెట్టుకుని, చప్టా మీద నాపరాళ్లు పరిచిన పతుగా సందు లేకుండా పడుకొని నిద్రపోతున్నాయి.

ఆ ఇరుకుసందుల్లోనే కొందరు ఆవుల్నీ గేదెల్నీ తోవకడ్డంగా కట్టేసి గడ్డీగాదం.పడేశారు. ఆరోచ్చులో పలుపుతాళ్లు జీరాడుతున్నాయి. ఈగల్ని తోలుకొంటో గాటలో గడ్డిపరకలు కొరుక్కొంటో నిశ్చింతగా పడుకున్నాయవి. అప్పుడే కురిసిన వానకి ఏళ్లూ కోళ్లూ ఏకమయ్యాయి. అటూ యిటూ వున్న 'సైడు' కాలవలు వాననీళ్లతో బలిసి నల్లగా కొండ చిలవలల్లే పడివున్నాయి. ఆ నీళ్లు ముందుకి కదలవు. వెన్నక్కిపోవు. ఉన్నచోట ఇంకవు. అక్కడక్కడ మురికీ నీళ్లు తోవకడ్డంగా ప్రవహించి అటూయిటూ వున్న సైడుకాలవలు చేతులు కలుపుకుంటున్నాయి. మురుగుకాలవ మీద దోమలపటాలం అగడ్తలో సైనికులు కోలాహలం చేస్తున్నట్టు 'జయ్య'మని విమానం మోత పెడుతోంది. తెట్టెగట్టిన నల్లని మురుగు దోమలకీ, సుసమలకీ పురుళ్లు పోస్తో, మశూచి క్రిముల్ని ఎడాపెడా సరఫరా చేస్తో, ఏమీ పట్టనట్టు తన 'డ్యూటీ' తను చేసుకుతోపోంది. ఇంత గలీజులోనూ ఇళ్లల్లో ముసుగులుతన్ని పడుకుని జనం కావేసిన మామిడిపళ్లల్లే మగ్గుతోనే వున్నారు. కొంతమంది ఉక్కకి తాళలేక సైడుకాలవల కడ్డంగా నులకమంచాలు వాల్చుకుని, ఆ దుర్వాసన అటూ యిటూ వృధాపోకుండా గాఢంగా పీల్చేస్తున్నారు.

పడమటి వీధిలో నించీ పెద్దబజార్లోకి అడుగు పెట్టారు. అటూయిటూ బత్తెంలేని పహరా జవాన్లకి మల్లే 'ఎలక్ట్రిక్ లైట్లు' పెద్దపెద్ద కళ్లు చేసుకుని నిర్మానుష్యంగా వున్న వీధుల్ని కాపలా గాస్తున్నాయి. పెద్దవయస్సేమో, రంగయ్యహేడ్డు చలికి వొణుకుతున్నాడు. 'యస్సయి' బనియనూ, బనీను మీద 'బుష్‌షర్టూ', 'షర్టు' మీద వూలు 'స్వెట్టరూ', 'స్వెట్టరు' కింద మెడ పైన 'మఫ్లరూ' బిగించినా, అడుగడుక్కీ దాటాలిసి వస్తున్న గలీజుకి విలవిలలాడిపోతున్నాడు. వాన చిత్తడిలో రోడ్డంతా నెత్తురోడుతున్నట్టు లసలసలాడుతోంది. అక్కడక్కడ గుంటలు రాచపుళ్లల్లే మెరుస్తున్నాయి. సైకిలు చక్రాల వూచల మీదనించీ ఎర్రమట్టి తుంపులు తుంపులుగా పడుతోంది. బజార్లో పెట్టెకొట్ల మధ్యనించీ దారి తీశారు. నిదురలో కనురెప్పలల్లే మూసుకున్న తలుపుల వెనక దుకాణాలన్నీ, ''డబ్బుడబ్బు'' అని కలవరిస్తున్నాయి. రోడ్డునిండా పేడకళ్లూ, మేక పెంటికలూ, ఖాళీ సిగరెట్టు పెట్టెలూ, సగం కాల్చిపారేసిన బీడీముక్కలూ, అరటిపళ్ల తొక్కలూ, కాగితమ్ముక్కలూ, తిని పారేసిన మొక్కజొన్న బొండ్లూ చెల్లాచెదురుగా పడివున్నాయి. రెండో ఆట సినిమా విడిచి పెట్టారుగావును, జనం తండోపతండాలుగా ఇళ్లకు పోతున్నారు. విజృంభిస్తున్న దోమలతో పోటీగా ఒక్కటే రొద! తుబుక్కున ఉమ్మేస్తో

పోతున్నారు. మధ్యమధ్య గణగణమంటూ విస్సురుగా, పోతున్న సైకిళ్లు, రిక్షాలు, రోడ్డువార వంపుల్లో లోతుగా నిలిచిన వాననీళ్లతో, సినిమానించీ చకచక నడిచిపోతున్న సరదా పురుషుల మీద ఇంత బురద జల్లి ముందుకి సాగిపోతున్నాయి. నడుస్తుంటే, మూసివున్న కిరణాకొట్ల పక్కనీ, కూరగాయ దుకాణాల వారనీ, సందుల మొగదలలోనూ, మాగిన అరటితొక్కలో నించీ, కుళ్లిన పుగాకు కాడల కశ్మలంలోనించీ ఘాటైన దుర్వాసన దూసుకొస్తోంది. అక్కడ ఒక్కక్షణం ఆగి, మేడల మీదకీ, మిద్దెల మీదకీ, ఒకసారి 'టార్చిలైటు' వేసి నాలుగువేపులా పరకాయించి చూశాడు సబ్‌ఇన్‌స్పెక్టరు. మనిషి పురుగు మసలడంలేదు. ఈ గలీజులో కుళ్ళులో, కరకర నములుతో, ఈగల్ని తోలుకొంటూ, విచ్చవిడిగా తిరుగుతున్న దైవాధీనపు గొడ్లొకటే! అవి ఎవరివో, ఎక్కడివో, ఎవ్వరికీ తెలియదు! తెల్లవారగానే మటుకు యజమాని ఇంటికి భద్రంగా చేరుకుని, కట్టుకొయ్యల దగ్గర నెమరేస్తూ పండుకుంటాయి బుద్ధిమంతనంగా. పైన ఉరుముతున్న నల్లటిమబ్బుని ఒక మెరుపు తీగ చక్‌చక్ మని కత్తిరించి పారేసింది. అవతల వీధి నించీ ఎవరో ఒక బీటు జవాను వేస్తున్న 'విజిల్' ఈదరగాలిని చీల్చుకుని, నిశ్శబ్దాన్ని గిలకొట్టి, ఆకాశంలో లయమైపోయింది. ఎక్కడో ఒక మద్దెల దరువు—ఏదో ఒక నాటకానికి 'రిహార్స'లు జరుగుతోంది గావును. మూసివున్న దుకాణాల ఖాళీ అరుగుల మీద, చిప్పాక్రా తలాపిని పదిలంగా ఉంచుకుని ముష్టివాళ్లు పన్నులేకుండా పక్కలుపరుచుకుని, పడుగూపేకగా పండుకొని నిద్రపోతున్నారు. వస్తువాహనాలు లేనివాడి నిశ్చింతా, చెదరని నిదరే ఆస్తిగా గలవాడి నిషూచీ ఆ పడకలో కొట్టొచ్చినట్టు ముద్ర వేసుకున్నాయి. ఈ చివరనించీ ఆ చివరకి ఒక్కసారి పారజూస్తే వీధి వీధంతా ఒక తెరిచిన అనాథశరణాలయంలా పరుచుకొని వుంది. కొందరిని లేపి, నిలేసి, ''ఎవరు నువ్వ''ని ప్రశ్నించారు. ఒకళ్లిద్దరు ఆకొట్టు కాపలాని కొట్టాయన పండుకోమన్నాడని నసిగారు. రంగయ్యహేడ్డుకి నమ్మబుద్ధి కాలేదు. 109 సెక్షన్ ముద్ర ఎవడి మొహాన వున్నదా అని వెతుక్కొంటూ పోతున్నారు.

అన్నదాన సత్రానికి దిగువ కిళ్లీకొట్టు తాలూకు బడ్డీకి సైకిలాన్చి సత్రం అరుగు మీద ఆ పడుకున్న దెవరో లేపి తీసుకురమ్మని రంగయ్య హేడ్డుని పంపాడు 'యస్సయి' మోహనరావు. దగ్గరసా కడుపుబ్బి పగిలిన మ్యునిసిపల్ కుండీలోనించీ చెత్తా చెదారమూ, గుడ్డపేలికలతో మూసిన నల్లమసిష్టమూ బైటపడి, కండలూ పేగులూ వెళ్ళుకొచ్చిన కళేబరంలా వుంది. 'ఎలక్ట్రిక్ పోల్' దగ్గర నిలబడి, 'బెర్కెలీ సిగరెట్టు' వెలిగించుకుని, అగ్గిపుల్ల గాలిలో ఊగించి, ఆర్పి అవతల పారేసి, గుప్పుగుప్పున రెండు పీల్పులు పీల్చి, రంగయ్యహేడ్డు వెళ్లిన వేపే చూస్తూ నిలబడ్డాడు 'యస్సయి'. 'ఎలక్ట్రిక్‌బల్బు' చుట్టూ వున్న పరివేషంలో, చిమ్మెటల్లా, గొల్లభామలల్లా, రెక్కలపురుగులూ విరవిహారం చేస్తున్నాయి. ఆ చిన్న పురుగుల తాలూకు పెద్దపెద్ద నీడలు రోడ్డుమయానా ఎదుటింటి తెల్లగోడల మీదా పారాడుతున్నాయి. అందులో కొన్ని ఆకతాయిలు 'యస్సయి'గారి చెవిలో దూరదామంటే 'మఫ్ల'రడ్డమొచ్చి, నోట్లోకి దారి తీదామంటే ఇంజన్లాంటి సిగరెట్టు పొగచిమ్మి అడ్డు ఆకాలేని నాసికాపుటాలలోకి 'క్యాపిస్టం'లో జొరబడ్డాయి. 'యస్సయి' చీదరించుకుని అసెంటూ తొలిగాడు

రంగయ్యహేడ్డు సత్రం అరుగుమీద పడుకున్న ఆసామీని తట్టిలేపాడు. వాడు కళ్లు నులుముకుని, ''ఎవరోరు?'' అని గొణిగాడు. నల్లచీంబోతులా వున్నాడు. అరిటిదొప్పల్లాంటి బుగ్గలు—బొద్దింక రెక్కల్లా కనుబొమలు...మనిషి ఎండిన వారుగల్లే వున్నాడు. కళ్లు గాజుబిళ్లలు!''—చూచి, ''ఓరి నువ్వటా మహంకాళీ?'' అని నివ్వెరపోయాడు రంగయ్యహేడ్డు.

* * *

రంగయ్యహేడ్డు మహంకాళీని ఎరుగును. మహంకాళీ విజయనగరం సైడునుంచీ పొట్ట చేత్తో పట్టుకుని రెక్కలమ్ముకుందామని బస్తీకి వచ్చిన ఒక నిర్భాగ్యుడు. వాడికి తల్లీతోడూలేరు. బస్తీలో జనం రద్దీగా వుంటారు. ఇంత జనాభాలో మనం ఒకళ్లమూ బ్రతకలేకపోతామా అన్న భరోసా ఒకటే వుదయిస్తుంది ఎంతటివాడికేనా. 'ఏరు ఎంత పారినా కుక్కకు

కతుకునీళ్ళే' అని నాలుగురోజులు పోతేనేగాని ఓపట్టాన గ్రాహ్యంకాదు. వాడికి ఏలూరు కొత్త. పట్టణ వాతావరణమే బెదురుగా వుంది. రాగానే ఏకాయకిని 'మెయిన్‌రోడ్డు' వెంబడి నడిచివెళ్ళి 'లెవెల్ క్రాసింగు' దాటాడు. రోడ్డు మొగని, తాపీమేస్త్రీలూ, కొంత మంది ఆడామగ కూలీలూ, దేనికో ఎదురు చూస్తు న్నారు. మేస్త్రీలు చొక్కాలు తొడుక్కున్నారు. ఆడకూలీలు చెప్పులేసుకున్నారు. చుట్టలు కాలుస్తు న్నారు. మగకూలీలు పంచెలెగగట్టారు. అంచులు జజ్జు జజ్జుయిపోయిన ఖాకీనిక్కర్లు తొడుక్కు న్నారు. ఒక ఆడకూలీ చేతిలో మూాలమట్టమూ చెక్కటాపీ వున్నాయి. మగకూలీ చేతిలో తూకమూ, గజంబద్దా, 'స్పిరిట్‌లెవెలూ' వున్నాయి. "ఏదేనా కూలీ ఇప్పియ్యండి మారాజా" అని అర్థించాడు మహంకాళీ. ఒక మెల్లకన్ను మేస్త్రీ ఎగాదిగా చూచి, "ఎవడవురా నువ్వు?" అని పరామర్శించాడు. "రాజుగారింట్లో కట్టుడు పనుంది కూలి కొస్తావా?" అన్నాడు. "ఓ" అన్నాడు మహంకాళీ. నక్కని తొక్కి వచ్చాననుకున్నాడు. రెండురోజులు వరసగా కూలీ దొరికింది. అంతలో వర్షాలొచ్చినయి. ఇళ్ళ కట్టుడు పనులూ రిపేర్లూ వాయిదా పడినై. కూలీ దొరకలేదు. 'ఆఫీసు'లకి వెడుతో, రైలుగేటు దగ్గర ఆగిన ఉద్యోగస్తుల ముందు "బాబూ నాయనా" అని చేయి జాపాడు. ఎవరేనా విదిపితే ఒక నయాపైసా రాలుతోంది. ఇది వరకు కానీ కానీ దక్కేది. ఇప్పుడది నయాపైసాకి దిగజారింది. ఏమార్పొచ్చినా అట్టడుగు మనిషి మీద ఒకరాయి అదనంగా పడిందన్న మాటేగా! ఏ చట్టంవచ్చినా, ఉన్నవాడి జేబులో కాస్త చినికి, లేనివాడి కళ్ళల్లో రెండు మెరుపులు మెరిసి చక్కాబోతుంది. ముష్టెత్తాడు చివరికి. ఏ గృహస్తూ ఒక్కగింజ రాల్చిన పాపానపోలేదు. కొందామంటేనే కనాకష్టంగా వున్న గింజలకి ముష్టి ఒకటా? అత్త గారు అడుక్కుతింటుంటే అల్లుడు మనుగుడవ నొచ్చినట్టయింది. నాలుగురోడ్లమొగలో తలగుడ్డ పరిచి కాస్సేపు బేలగా మొహంపెట్టి కూచున్నాడు. దురదృష్టం! కుంటి గుడ్డి కాదయెను! ఒక్కపైసా రాలలేదు. ఊళ్లో అన్నదాన సత్రమొకటుందని తెలి సింది. కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళాడు. సత్రం గుమాస్తా చీటీ ఇచ్చాడు. ఆ వేళకి జీవాత్మ శాంతించింది. మన్నాడు మళ్ళీ చీటీకని దేవిరించాడు. "రోజూ ఇదేపనా?" అని కసురుకున్నాడు గుమాస్తా. కూలీ అహోరించి నప్పుడు మిగుల్చుకున్న చిల్లరడబ్బులు నాలుగూ క్షయమైపోయాయి. ఒకనాడు పాతాళించిన శనగలు తినీ, ఒకరోజు ఫక్తు కొళాయినీళ్ళుతాగీ, అగమ్మ కాకిలా తిరగగానే వొంట్లో ఒకానొక తూలుడు ప్రవే శించింది. పొత్తికడుపు కింద సన్నని మంట చురచుర పేగుల్ని కోస్తోంది. శనివారప్పేట మలుపు దగ్గర వంతెన పిట్టగోడమీద వొంటి మీద స్పృహ లేకుండా పడివుండగా ఎవరో ఒక పుణ్యాత్ముడు, పెద్దాసు పత్రిలో చేర్పి చక్కాబోయాడు.

ఆసుపత్రిలో తెలివి వచ్చేసరికి ఒక ఇనపమంచం మీద వున్నట్టు గ్రహింపుకొచ్చింది మహంకాళీకి. పైన 'సీలింగు' ఫేన్ గిర్రున తిరుగుతోంది. మంచం మీద తెల్లని దుప్పటి పరిచారు. మీద ఎర్రని 'రగ్గు' కప్పారు. కాళ్ళకట్టున తెరిచివున్న పెద అద్దాల కిటికీ మీద 'ఎలక్ట్రిక్‌లైటు' వెలుగు ముద్దగాపడి జిగ్గుమంటోంది. చుట్టూ మంచాల మీద ఉసూరోమంటూ పడుకున్న రోగులు ఉండి ఉండి మూలుగుతున్నారు. ఆసుపత్రంతా ఫినాయిలు వాసన. 'కారిడర్'లో 'ట్రాలీ'ల మీదా, 'వీలింగు చెయిర్ల'లో, 'స్ట్రెచర్ల' మీదా రోగుల్ని అటూ యిటూ తీసుకుపోతున్నారు. ఒకటే రణగొణ ధ్వని. కొందరు పక్కలమీద 'రబ్బరు సంచులతో 'ఇంజ క్షన్లిచ్చిన చోట జబ్బల మీద వేన్నీళ్ళ కాచు కుంటున్నారు. హాలుకి ముందు, కాస్తవారగా, 'టేబిలు' మీద మందుసీసాలూ, ఎనామిల్ గిన్నెలూ పళ్ళాలూ మెరిసిపోతున్నాయి. 'మేల్‌నర్సింగ్ ఆర్డర్లీ' ఒకతను 'అవున్సుగ్లాసు'తో మందులు కలుపుతున్నాడు. వెనకాల 'డ్యూటీరూం'లో మెడలో పాము మెలికలల్లే 'స్టెతస్కోపు' వేసుకుని, హడావుడిగా తిరుగుతో, 'స్టాఫ్‌నర్సు'తో ఎవళ్ళకేమి మందివ్వాల్సో వివరించి చెబుతున్నాడొక డాక్టరు. ఎక్కడచూచినా ఆసుపత్రి నర్సులు తెల్లని 'పవుడరు' రాసుకుని, తెల్లని 'గవు' న్లేసుకుని పిప్పరమెంటు బిళ్ళలల్లే అవుపిస్తున్నారు. ఆసుపత్రిలో జేర్చిన రెండురోజులకి పరీక్ష చేశారు. పరీక్ష చేసిన రెండురోజులకి ఫలానా మందు వాడాలి అని మంచానికి వేళ్ళాడదీసిన 'కేస్‌షీటు'లో వ్రాశారు.

రోజూమటుకు 'అగ్జిలియరీ నర్సింగ్ మెయిడ్' ఒకామె వచ్చి 'థర్మామీటరు' నోట్లోవుంచి 'టెంపరేచరు' చూచి 'ఛార్టు'లో వ్రాసిపోతోంది. ఎవరి 'డ్యూటీ' వాళ్ళు చేసుకునిపోతున్నారు. ఏతావాతా, మందు చేతిలో కొచ్చేసరికి 'టెంపరేచరు' తగ్గిపోయింది. కాని, గుడ్డిలో మెల్ల—రోజూ ఉదయమూ సాయంత్రమూ దాని పుణ్యమా అని తోపుడుబండీ మీద వాన్‌రొట్టెలూ, బత్తాయిపళ్ళూ,అరటిపళ్ళూ ఒకబెల్లం ముక్కా తీసుకొచ్చి'కోటా'ప్రకారం నాగాలు లేకుండాఇచ్చిపోతున్నారు.ఇదీ ఒకందుకు మంచిదే అనుకున్నాడు మహంకాళీ. మందుబిళ్ల నోట్లో వేసుకుందామంటే మంచినీళ్లు తెచ్చిపెట్టే నాధుడు లేడు. ఒంట్లోనా జివచచ్చి లేచినప్పుడు కళ్లు బయర్లు కమ్ముతున్నాయి. కాని తోపుడు బండీ వచ్చినప్పుడు మాత్రం, సత్తువ కూడదీసుకుని, ఎట్లాగో ఓపిక తెచ్చుకుని, సోలుతోనో తూలుతోనో దగ్గరికి వెళ్లి ఏమరకుండా పాలూ రొట్టే అందిపుచ్చుకుని 'బెడ్ లాకర్'లో భద్రంగా పెట్టుకుంటున్నాడు. మందూ మాకూ అడగాలన్న ధ్యాసే లేకపోయింది. మొదటి రోజున ఒక కుక్క వచ్చి రొట్టెముక్క కాస్తా నోట గరుచుకుపోయింది. ఆసుపత్రి నిండా ఎక్కడ చూచినా కుక్కలే! పెద్దగేటు దగ్గర ఘూర్కా అయితే మనుషుల్ని అటకాయిస్తున్నాడుగాని కుక్కల్ని వొదిలేస్తున్నాడు. ఆ కుక్కలికి 'కబోర్డు'లో రొట్టెముక్కా బెల్లంముక్కా ఏటయిముకు హాజరుగా వుంటయ్యో, ముట్టెతో మూసిన తలుపులు ఎట్లా వొత్తిగించాలో, ముంగాళ్లు పైకెత్తి పొట్లాములు బైటికెట్లా లాగాలో, ఆ వొడుపులన్నీ క్షుణ్ణంగా తెలుసును. మర్నాటి నించీ కుక్క ఆ దరిమేనా రాకుండా జాగర్తపడ్డాడు. పాలూ రొట్టే నాలుగురోజులు వంటబట్టగానే జ్వరం ఎక్కడిదక్కడ ఎగిరి చక్కాబోయింది. పొత్తికడుపు కింద మంట—ఇంతాజేసి ఆకలిమంట అయివుంటుంది. నిస్త్రాణకొద్దీ తూలి వుంటాడు. మంచులో ఆరుబయట పండుకున్న మూలాన కాస్త ఉష్ణం తగిలివుంటుంది బహుశా. ఇంతవరకూ మందులు వేసుకోవడం లేదన్న సమాచారం గాని, రోగనిదానం పుష్టికరమైన రొట్టెముక్కల లోనూ రసంగల బత్తాయి తొనలలోనూ ఉన్నంతగా 'స్టెతస్కోపులూ' 'థర్మామీటర్ల'లో లేదన్న చిదంబర రహస్యంగాని మహంకాళి కొక్కడికే తెలుసు. రెండోకంటివాడికి తెలియదు. నాలుగైదురోజులలో కోలుకొని, కాస్త నేవళం తేరి, మంచం వొదిలి, అడపా తడపా కొంచెం తచ్చాడుతున్నాడు. పాలయితే అన్నీ పిండి పాలు. కాని ఆసుపత్రి చివర, అయిమూలగా, రోజూ ప్రొద్దుట గేదెల్నీ ఆవుల్నీ గుంపుగా నిలబెట్టి పాలు తెగపితికేస్తున్నారు. అవన్నీ ఎక్కడికి సరఫరా అవుతున్నాయో, ఇవెక్కడనించీ వచ్చిరోగులపాలబడుతున్నాయో, "ఏదో కుంభకోణముంది" అనుకున్నాడు మహంకాళి. అయినా ఈ స్తనశల్య పరీక్ష తనకెందుకూ? పుణ్యానికి పుట్టెడుగింజలు కొలిస్తే పిచ్చకుంచ మన్నాట్ట! నోరు మూసుకున్నాడు. ఎటొచ్చీ ఓపిక లేనప్పుడు మంచం మీదనించీ తనని లేవదీసిన వాళ్లుగాని, రెక్కపట్టుకుని కాస్త ఆసరా యిచ్చిన మహరాజులుగాని ఎవరూ కనిపించలేదు. నర్సులయితే మందుబిళ్లలా గట్రా ఇచ్చిపోతున్నారంతే. అయితే తనకంటే దిక్కూమొక్కూ లేదుగాని, ప్రతి రోగికీ పక్కన అయినవాళ్లెవరో ఒకరు ఉంటూనే వున్నారు. నర్సులయినా కాస్త పచ్చగా తెల్లబట్ట లేసుకున్న రోగుల దగ్గర అడకువగా ఏమి కావాలో కనిపెడుతూనే వున్నారు. తనలాంటి బక్కచిక్కిన వాళ్లకే ఇరకటం. "నీ కెవరూ లేరట్రా?" అని గదమాయించింది ఒకనాడు నర్సు. "వోరూ లేరండి" అని దిగాలుగా మొహం పెట్టాడు కాస్సేపు. పల్లెటిదిక్కున పాచిపని చేసుకుంటున్న తల్లి వుందని వొదిలేసి.

మొత్తమ్మీద అందర్‌దర్బారుగా జరిగిపోతోంది మహంకాళికి. "దేశం ఎంత సుభిక్షంగా నడుస్తున్నది. మహరాజులు, అయాచితంగా, డబ్బూ దస్కం అడక్కుండా, అప్పనంగా, ఎన్ని సదుపాయాలు అమిర్చిపెడుతున్నారు! ఎంత మర్యాద—ఎంత మన్నన!" అని తెగమురిసిపోయాడు మహంకాళీ.

* * *

కాని, ఒకనాడు ఒక విడ్డూరం జరిగింది. మహంకాళీ మంచానికి రెండుమంచాల అవతలగా ఒక రోగి వున్నాడు. ఆవేళ 'డి. యం. వో' 'రవుండ్సు'కి వచ్చి, అక్కడ నిల్చుని, స్టాఫ్‌నర్సుని పిలిపించి అందరి ముందూ దులిపేస్తున్నాడు. ఏమా ఈ రభస అని

మహంకాళీ చెవులు దోరబెట్టుకుని విన్నాడు. అర్థం కాలేదు. డి. యం. వో వెళ్ళిపోయింతరవాత నర్సు ఏదో గొడవగా అరుస్తో పోతోంది 'డ్యూటీరూం'లోకి. అతగాడు—ఆ రోగి—నీరసంగా వున్నాడట. కదల గూడదట. కదలలేడట. నోట్లో బిళ్ళవేసి మంచి నీళ్ళందివ్వలేదట నర్సు! వాడు తురతురమని డి.యం. వో.తో ఫిర్యాదు చేశాట్ట పైగా! అదో అపరాధమా? ఆ నర్సమ్మ అట్లా బేలగా తేలిపోతుందేమిటి? అది ఆవిడ డ్యూటీనా? నోరున్నవాడిదే రాజ్యం గావును. దిక్కుమాలిన గోల. ఆ తరవాత ఆరా తీశాడు మహంకాళీ. ఆ రోగి పేరు రాజాలు. వాడికి సిమెంటు కార్ఖానాలో పని. గుండెపోటుకని ఆసుపత్రిలో జేరాడు. మెల్లిగా మహంకాళీ వాడితో దోస్తీ కలిపాడు. రాత్రిళ్ళు పొద్దుపోయిం తరవాత గుమ్మాల ముందు కూచుని ఏవో సొదలు వెళ్ళబోసుకునే వాళ్ళిద్దరూను. రాజాలు విచిత్రంగా మాట్లాడతాడు. ఆ తిరుగుతున్న 'నర్సులీ', 'తోటీలనీ', 'నర్సింగ్ ఆర్డర్లీ'లనీ రోగులకి ఉపచారాలు చేసేందుకే జీతాలిచ్చి పెట్టారట! ఏదో సుతారంగా మందుబిళ్లలిచ్చీ, రొట్టెముక్కలందిచ్చీ రోగులకి చెయ్యాలిసిన సేవలూ గట్రా తక్కిన డ్యూటీలన్నీ ఎగవేస్తున్నారట! రోగి మంచం మీద నించీ లేవలేకపోతే, వాళ్ళు రెక్కాసరా యిచ్చి లేవనెత్తాలట. పక్కగుడ్డలు ఏరోజు కారోజు దులిపి అవసరమైనప్పుడల్లా మార్చాలట! రాత్రిళ్ళు మూలిగితే ఆరా ఉడగాలట! అవసరమైతే డాక్టరికి కబురు పెట్టాలట! అదేమీ కనపడదు ఆసుపత్రిలో. వాళ్ళు తీసుకుంటున్న జీతాలు గవర్నమెంటోడు ఇస్తున్నవేనట! సర్కారుకి పల్లెటి దిక్కు లగాయతూ పన్నులు గడితేనేగాని లేకపోతే ఖాళీయేనట! మహంకాళీకి నమ్మబుద్ధి కాలేదు. వాడొక తిక్కశంకరయ్య! ఆసుపత్రి అట్టుపుట్టు ఆన వాళ్ళన్నీ తనకి తెలుసన్నట్టు వాగుతాడు! అనుకున్నాడు మహంకాళీ. అంత సుబ్బరమైన బట్టలేసుకుని, అట్టె తెల్లగా మెరిసిపోతున్న ఈ నర్సమ్మలు తన లాంటి మకిరి సన్నాసుల్ని పట్టుకునీ, ముట్టుకునీ, చెంబుజేసుకునీ, అడ్డమైన చాకిరీలూ చెయ్యాలీఅంటే తనకే సబవనిపించడంలేదు. అసహ్యం వెయ్యదూ? బట్టలు గలీజు కావూ? ఇట్లా కాదని ఒకసారి తోటీ రాముల్ని అడిగి చూచాడు—మహంకాళి. ఈ నర్సులకెంతెంత జీతాలూ అని. వాడు చెప్పిన అంకెతో మహంకాళీ గుండె ఆగింది. గవర్నమెంటోడు అంతేసి జీతాలు ఏదో తెల్లగవున్నేసుకునీ, మెత్తని 'కేన్వాసు' చెప్పులేసుకునీ, పువ్వులమ్మినట్టు పళ్ళాపొలా అందించీ, డాక్టర్లతో చలాకీగా మాట్లాడీ, అట్టాఅట్టా కులాసాగా తిరిగినందుకే ఇస్తారా? ఇందులో ఏదో తిరకాసుంది అనుకున్నాడు మహంకాళి. తన కన్యాయం జరిగిందా? ఏమో మనిషన్న వాడికి మనిషిగా బతికే హక్కు ఎంతవరకూ ఉందో, ఎంతమందికి తెలుసు ఈ విశాల ప్రపంచంలో? తలవంచుకుని నీ'డ్యూటీ' మాత్రం నువ్వు చేసుకుపోస్మీ లేకపోతే-నరకాన పడతావు అని ధర్మశాస్త్రాలయితే ఉద్ఘోషిస్తున్నాయి. దారీ డొంకా తెలియని ఈ నాగరిక మహారణ్యంలో ఎవడి జేబులో ఎవడు చెయ్యి పెడుతున్నాడో, ఎవడికెవడు బాకీ వున్నాడో ఏమి తెలిసి చస్తుందీ? తనకైతే అన్నీ సజావుగానే నడిచినై ఫరవాలేదు, అనిపించింది మహంకాళీకి. తనకి జరగని అపచారానికి తను బుర్ర పాడు చేసుకోవడం దేనికీ? కాస్త తెరిపిన పడగానే, హక్కుల సంగతిఆలోచనలు సుడి తిరుగుతున్నాయి తనలో— హక్కులు!

ఉన్నట్టుండి పిడుగుపాటులాంటి ఆపత్తు వొచ్చి పడింది. మహంకాళీని ఆసుపత్రినించీ 'డిస్చార్జి' చేశారు. ఇంకా లోజ్వరముంది.బాబ్బాబు అని ప్రాధేయపడ్డాడు. డాక్టర్లు ఖాతరు చెయ్యలేదు. అయితే, జ్వరం-తగ్గి'వార్డు'లో కాస్త అటూయిటూ తబ్బాడుతున్నప్పుడు ఒక చిన్నపథకం వేసుకునే కూచున్నాడు మహంకాళీ. ఠికామీగా ఉన్నాడని నర్సులు అడపా తడపా కొన్ని చిల్లరపనులు పురమాయిస్తో వచ్చారు మహంకాళీకి. 'డి. యం. వో' 'రవుండ్స్'కి వచ్చే ముందు, 'కబోర్డు'లు తుడవమనీ, తోవలో పడిన బత్తాయి తొక్కలు చెత్తకుండీలో పడేయమనీ, తోపుడుబండీ వెనక తోడుగా ఉండమనీ, ఆ మూల ఫ్లిట్‌పంపు కొట్టిరమ్మనీ, అక్కడ రోగికి 'బెడ్‌పాన్' ఇచ్చి రమ్మనీ, ఇక్కడ రోగికి 'యూరినల్' అందిమ్మనీ. ఇట్లాంటి చిల్లరమల్లర పనులు చెప్పగానే ఇష్టంగా చేసేవాడు. డాక్టర్లకీ, నర్సులకీ కాఫీలూ టిఫిన్లూ తెచ్చిపెట్టి వాళ్ళ కనుసన్నలలో మెలిగేవాడు. అత

గాడు ఆసుపత్రి సిబ్బందిలో ఒకడనుకుని, 'వార్డు'ల ఉన్న రోగులు సైతం ఆ పనీ ఈ పనీ చెప్పి చేయించుకోవడం ప్రారంభించారు. 'డిస్చార్జి' అయి వెళ్ళిపోయే ముందూ మధ్యలోనూ పావలా అర్ధా ముట్టజెబుతున్నారు. నర్సులూ యం. యన్. వోలూ తను 'డిస్చార్జి' అయింతరవాత గూడా వేళకిన్ని పాలూ ఇంత రొట్టె, ఒక అన్నంపళ్ళెమూ అడక్కుండానే ఇస్తూ వచ్చారు. అవసరమైతే ఏ రోగి నోట్లోనో కరక్కాయిగొట్టి వాడి కోటా వాడికి మిగిల్చి, మరీ ఆ కట్టుకుంటున్నారు వాణ్ణి. మెట్టుకి 'నర్సు'లూ, 'ఆగ్జిలియరీ నర్సులూ' తాము చెయ్యాల్సిన 'డ్యూటీ'లన్నీ లబ్జుగా మహంకాళీచేత చేయించి చిల్లర మల్లరగా రోగుల దగ్గర పిండుకొమ్మని చెప్పకుండా ఉపాయం చెప్పి ఊరుకున్నారు. ఆమట్న తీరిగ్గా 'డ్యూటీరూం'లో కిలకిలా నవ్వుకొంటూ ఖుషీగా కాలక్షేపం చేస్తున్నారు. ఇది మహబాగా వుందనుకొన్నాడు మహంకాళీ. పెద్దమామూళ్ళు తనదాకా వొచ్చేవా అని సరిపెట్టుకున్నాడు. ప్రొద్దున్న 'డి. యం. వో' 'రవుండ్స్'కి వచ్చి రోగుల్ని పరీక్ష చేస్తున్నప్పుడు మటుకు కాస్సేపు ఏమూలనో తల దాచుకుంటున్నాడు. ఆసుపత్రిలో ఆసుపత్రిఉద్యోగులూ, రోగులూ మినహా ఎవరూ ఉండగూడదు మరి. ఆ తరవాత విచ్చలవిడిగా డాక్టర్లకీ, నర్సులకీ, రోగులకీ, కావలిసిందల్లా అందించి, అడ్డమైన చాకిరీలూ చేస్తున్నాడు. ప్రతిఫలంగా నాలుగు చిల్లరడబ్బులు చేజిక్కించుకుంటున్నాడు. రాత్రిళ్ళు బీడీలు కాల్చుకొంటూ ఖులాసాగా రోజులు వెళ్ళమారుస్తున్నాడు. తనపని నిమ్మకాయవాటంగా ఉన్నదనుకున్నాడు మహంకాళి.

ఆ సందర్భంలోనే రంగయ్యహేడ్డు తటస్థపడ్డాడు మహంకాళీకి. రంగయ్యహేడ్డు ఏదో గాయానికి కట్లు గట్టించుకుందుకని 'ఇన్‌పేషెంటు'గా 'జాయి'నయ్యాడు ఆసుపత్రిలో. ఆయనకి అరఖులం దివ్వా, 'బెడ్‌లాకర్' నించీ మంచినీళ్ళతేనూ, లోటాలో పాలుపట్టి జాగర్త పెట్టనూ, బత్తాయి తొనలు వొలిచిపెట్టనూ అన్నిసదుపాయాలూ అమిర్చిపెడుతో అతగాణ్ణి మంచి చేసుకుని కాస్త దండిగానే డబ్బులు వడుక్కున్నాడు. రంగయ్యహేడ్డు మంచివాడు. ఆసుపత్రిలో వున్నన్నాళ్ళూ తనని కనిపెట్టుకుని వున్నందుకు మహంకాళీని మహాప్రీతిగా చూచాడు. 'డిస్చార్జి' అయి వెళ్ళిపోతూ రెండురూపాయిలు బక్షీలిచ్చి ఎప్పుడేనా 'లైను'లోకి రా అన్నాడు.

కాని ఒక చిన్న పొరపాటు జరిగింది. మహంకాళీ ఆసుపత్రిలో అడగనివాడిదే పాపమన్నట్టు అందరికీ అరవచాకిరీ చేశాడు. అదీ వొచ్చిన అసిఘాత. ఇష్టంగా చేస్తున్నాడు గదా అని చేయించుకునే వాళ్ళు ఎక్కువైపోయారు 'వార్డు'లో. అప్పనంగా చేయించుకోవడం మరిగారు కొందరు; ముట్టజెప్పే నాలుగు చిల్లడబ్బులికీ గుంటచిక్కులు పెట్టారు మరికొందరు; ఇస్తాఇస్తా అని ఆఖరికి తాంటచెయ్యి చూపించి చెప్పాపెట్టకుండా ఉడాయించారు ఇంకొందరు. ఇటా కాదనుకున్నాడు మహంకాళి. అర్థంలేనివాడు వ్యర్థుడన్! ఇప్పుడే నాలుగురాళ్ళు వొల్చుకోవాలనుకున్నాడు. చెరుకా బెల్లం పెట్టమంటే పెడుతుందీ? విరిచి గానుగలో పెట్టి తిప్పి, నలగ్గొడితేనేగాని నాలుగు పానకం చుక్కలు రాల్చదు ఓపట్నాన. మనిషికింతా అని 'రేటు' పెట్టాడు. కోతికి కొబ్బరికాయ దొరికినట్టు, ఆ 'రేటు' దఫదఫాలుగా పెంచాడు. 'ఎడ్వాన్సు'గా కొంత ముట్టజెబితేనేగాని అసలు పలికేదే లేదని మొరాయించాడు. వెనకాల నించీ వాళ్ళు పిలుస్తుంటే పట్టించుకోకండా ముందుకి దూసుకుపోతున్నాడు. దరిమిలా రంగయ్యహేడ్డు కొక్కడికీ మినహా తక్కిన వాళ్ళకెవళ్ళకీ పలక్కపోవడంతో కొందరు 'పేషెంట్లు' కావేషలు పెంచుకున్నారు. వాడు ఆసుపత్రి సిబ్బందిలో ఒకడన్న అపోహ అల్లుకుపోయింది పైగా. దానాదీనా కొంత శత్రుత్వమూ కొనితెచ్చుకున్నాడు మహంకాళీ.. తోటీ రాముడుకి సరేసరి. మహంకాళి అంటే పీకలదాకా వుంది. మహంకాళి చేస్తున్న కొన్ని చిల్లరపనులు తోటీ రాముడు చెయ్యకుండానే ఎగవేసి, 'పేషెంట్లు' ఆసుపత్రినించీ 'డిస్చారి' అయి వెళ్ళిపోయ్యే సందున నవ్వుతో ఎదురుగా నిలబడి ''తోటీనండి'' అని వెళ్ళబోసుకుని మామూళ్ళు వట్టినే దండుకునేవాడు అందాకా. ఇప్పుడు వాడికి వీడి పోటీ ఒకటీ—రోగులికి కావలిసిన పనులు చేసి పెట్టడంలో కాదు, బక్షీలు వాడుక్కోవడంలో—ఈ మహంకాళీగాడు ఏకైవచ్చి మేకై బిగిసిపోయి

తనకి రావలసిన మామూళ్లు కాజేస్తున్నాడని వాడికి అక్కసుగా వుంది. చూస్తూవుంటే మేస్త్రీ పోతున్నాడాయెను—వాడికి అక్కడ వున్న డాక్టర్లూ, నర్సులూ వత్తాసీ! కాని, కోడిగుడ్డు చితగ్గొట్టాలంటే గుండ్రాయి కావాలి! వీడి పని పట్టాలని, తోటి రాములు ఒకనాడు నేరుగా 'డి. యం. వొ.'కే పితూరీ చేశాడు. వాడు పై మనిషనీ, ఇక్కడ గాదెకిందపందికొక్కల్లే జేరాడనీ, ఏనాడో డిస్చార్జయిన రోగి అనీ, వాడికిక్కడ ఉండాల్సిన పనిలేదనీ, రోగుల్ని జలగల్లే పీల్చుకు తింటున్నాడనీ, ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పాడు. కొంతమంది రోగులు వంత పలకనూ పలికారు. ''ఎవడీ మహంకాళీ?'' అని ఆరా తీశాడు 'డి.యం.వొ'. వచ్చి నిలబడ్డాడు. ''ఎవడవురా నువ్వు? ఎందుకొచ్చావిక్కడికి?'' అని 'సీరియస్'గా అడిగాడు. దొంగకి తేలు కుట్టినట్టు బిక్కుబిక్కుమంటో చూచాడు మహంకాళీ. నర్సులు తమని కాదన్నట్టు మొహాలు తప్పించారు. ''ఒరే రాములూ వీణ్ణి బైటికి నెట్టు'' అని 'ఆర్డరు' వేశాడు 'డి. యం.వొ'. తోటి రాములు అంతపనీ చేశాడు. ''నోట మట్టిగొడితివి గదరా'' అనుకుని బైటికి నడిచాడు మహంకాళీ.

నదరుగా వుందిగదా తిష్టవేదామని చూస్తే తుండూ తుపాకీ ఎగిరి చక్కాబోయింది. తల తడుముకుని నాలుగురోడ్ల మొగలో షెడ్డీపైకి లాక్కుని, ఊడిపోతున్న తలగుడ్డ సర్దుకుని, ఎటు పోదామా అని మీనమేషాలు లెఖ్ఖపెట్టాడు కాస్సేపు. రోడ్డువారని కాళ్లల్లో ముట్టె దూర్చి కుక్కపిల్ల పడుకుంది. ఒక్కతన్ను తన్నాడు. కుయిక్కుమంది. కాలేజీ రోడ్డు కలకలలాడుతోంది. కూరగాయ కొట్ల మీద దెందులూరు వంకాయలు మిసమిసలాడిపోతున్నాయి. కొరుక్కు తిందామా అనిపించింది. అలవాటు తప్పిన ఆకలి మళ్లీ చురచురమంటోంది. కాఫీహోటళ్లు మాత్రం చవకగా నేతి ఘుమఘుఃఘలు వీధుల్లోకి జారీ చేస్తున్నాయి ఖరీదడక్కుండా. మిఠాయి కొట్టాయన బొర్ర పెంచుకున్నట్టున్నాడు. జంగిడిలో మిఠాయి వుండలు గుండ్రంగా మెరుస్తున్నాయి. ఒకపళ్లెంలో మైసూరు పాక్ ముక్కలు ఒకదాని మీద ఒకటి, మధ్యమధ్య పావురాయి గూళ్లల్లే వాటంగా వొదిలి, గుడి గోపురంలా మహపసందుగా పేర్చాడు. రోడ్డు మీద అందరూ ఏదో పనిమీద హడావుడిగా పెద్దపెద్ద కేకలేసుకొంటో పోతున్నారు. తనకొక్కడికే పనీపాటా లేదు. ఒకచోట వేరుశనక్కాయలు నములుతో రాజిగాడు అవుపించాడు. రాజాలు ఇదివరకే 'డిస్చార్జ్'యి వెళ్లిపోయాడు ఆసుపత్రినించీ. పిమెంటు కార్ఖానాలో వాడిస్థానే ఎవడో దూరి చక్కా ఊరుకున్నాట్ట. ఒకటిరెండు రోజులు 'బస్సుస్టాండు' దగ్గర ట్రంకు పెట్టెలు దింపీ, 'డిపో' దగ్గర సరుకుల బస్తాలు మోసీ వెళ్లమార్చాడట. బొచ్చు ఎంత కాలిస్తే మటుకు బొగ్గవుతుందీ? ఇప్పుడు మళ్లీ ఖాళీ! మొహం డోక్కుపోయింది. ఆసుపత్రిలో హక్కుల్ని గురించి మహ తలతిరుగుడుగా ప్రసంగించేవాడు. ప్రతిదానికీ అద్వయితంగా 'లా పాయింట్లు' తీశేవాడు. లేనిపోని జట్టీలు కొని తెచ్చుకునేవాడు. వట్టి శగపట్లు గోత్రమని నలుగురూ నిందించేవాళ్లు. ఎంతమంది పడి వుండడంలేదూ? తను మహ పొడిచేశినట్లు 'రింగ్ లీడర్'లా 'పోజు' పెట్టి వోరు చేసుకునేవాడు. ఇప్పుడు పులుసు చచ్చింది! మూన్నాళ్ల పట్టపగలు! అన్న మదమణిగితే సరీ అన్ని మదాలూ అణగారతాయి. ''త్రాహిత్రాహి'' అంటున్నా డిప్పుడు. ''ఇద్దరి నశీబూ ఒక్కలానే వుందిలే'' అన్నాడు మహంకాళి. వాడి దారిన వాడు చక్కా బోయాడు.

కూరలబజారులో తట్టవేదామా అనుకున్నాడు. దానికీ ఒక తట్ట కావాలి అని స్ఫురించింది. చిన్న కర్రవంతెన పక్కని మేదర గుడిశలో తట్ట ఎంతా అని బేరంచేశాడు. రూపాయి చెప్పారు. జేబూ తడిమి చూచుకున్నాడు. ముప్ఫయి నయాపైసలున్నాయి. ముంత కింద శనగపప్పింతతిని, మంచం మిఠాయి కాస్త నమిలి, కొళాయి నీళ్లు పూటుగా పట్టించేసి సాయంత్రం దాకా కాలుగాలిన పిల్లిలా అటూయిటూ బలాదూరు తిరిగాడు.

అనుకోకుండా అన్నదానసత్రం కేసి దారి తీశాడు. సత్రం తలుపులు మూసి వున్నాయి. గాడ్రేజ్ తాళం కప్ప రాతిగుండె వతుగా గట్టిగా కరుచుకొని వుంది గొళ్లానికి. అటు మూలగా అరుగు మీద ఎవడో పడుకున్నాడు. రాజిగాడు! వాడూ అక్కడికే తయారయ్యాడు? అరుగుచివ్వర తలగుడ్డ పరుచుకుని పడుకున్నాడు మహంకాళీ. ఆసుపత్రిలో భలే మజాగా

కాలక్షేపమయిందనుకున్నాడు. అక్కడి సౌఖ్యమూ సదుపాయమూ నెమరుకొచ్చి దిగులేసింది. పెళ్ళినాటి ముచ్చట లంఖణాలవాడు తల్చుకుంటే ఏమికాను అనిపించింది. ఇక ఆ వేళకి దుప్పి భోజనమే అనుకున్నాడు. ఒక్కరెండు రోజులు ఎవరేనా ఆదుకుంటే పని దొరక్కపోదు. కాని ఈ రెండురోజులూ ఇట్లా తిండిలేక దిగనాసిల్లిపోతే ఆ తరవాత పని దొరికినా ఏమి చెయ్యగలడు?.. ఆకలెక్కువై నీరస మొచ్చింది. నీరసమ్మీద నిద్ర ముంచుకొచ్చింది. ఆవలింతలొచ్చి అమట్న చిటికెలు వేసుకొంటో అట్లాగే వొరిగాడు.

రెండు ఝాముల వేళ ఎవరో తట్టినట్టయి ఉలిక్కిపడి లేచాడు. రంగయ్య హేడ్డు— చెట్టంత మనిషి ఎట్ట ఎదట దేవుడల్లే అగుపించాడు. పిచ్చుగుంట మీద భాగీరథి ప్రవహించినట్టయి మొహమింత జేసుకున్నాడు మహంకాళి.

*                *                *

సబిన్స్పెక్టరు మోహనరావు 'సైకిల్ ఫ్రేము' కానుకొని పూలుస్పెట్టరు మీద తుప్పర్ల దులుపు కొంటో పరకాయించి చూచాడు. ఈ పెద్ద హేడ్డు అదేపోకగాపోయి ఆ నిద్రలేచిన ఆసామీతో ఒక్కటాకీన ఇష్టాగోష్ఠిలో పడ్డాడేమా అని మొహం చిట్లించుకున్నాడు. కాస్సేపటికి రంగయ్య హేడ్డు మహంకాళీ 'యస్సయి' దగ్గరకి వచ్చారు. ''వీడేసార్ మహంకాళీ'' అని 'యస్సయి'కి తెలియజెబుతున్నాడు రంగయ్య హేడ్డు. మహంకాళీని గురించి అంతకు క్రితం ఏదో ఇష్టాగోష్ఠిలో చాలావరకు చెప్పేవున్నాడు హేడ్డు. అమట్న, ''వాడా వీడు? సరిపోయింది. అతగాడితో ఏక మాటలు పెట్టుకుని కూచుంటే, 109 కింద ఏదో కేసు ఒకటయినా దొరికిందిగావును అని మురుస్తున్నాను నేనూ'' అని మొహం ముడిచాడు 'యస్సయి'. ''దానికేమండీ? కేసు పెట్టేదాం సార్'' అని తల వూపేస్తున్నాడు రంగయ్య హేడ్డు. సబిన్స్పెక్టరుకి అర్థంకాలేదు. 109 కింద అనుమానించదగిన పరిస్థితులలో ఎవడేవా దొరుకుతాడా అని గస్తీ తిరుగుతుంటే తనకి ఆసుపత్రిలో అరవచాకిరీ చేసిన ఒక బక్కవాణ్ణి పట్టుకుని వాడిమీద కేసు బనాయిద్దామంటాడేమిటి హేడ్డు? న్యాయమూ అన్యాయమూ అక్కర్లే? అంతదారుణమా? రంగయ్యహేడ్డు చాలాదూరం నచ్చజెప్పాడు 'యస్సయి'కి.,.''వాడే పెట్టమంటున్నాడండి తనమీద జామీను కేసు—ఏదో కనికరించండి పాపం'' అని అతిసులభంగా నవ్వుతో సిఫార్సు చేస్తున్నాడు పైపెచ్చు. ''అరె కనికరించక వాణ్ణి పట్టుకున్నావూ ఇప్పుడు? వాడు చేసిన నేరమేమున్నదనీ?'' అదిరిపడ్డాడు 'యస్సయి'.

''కాదండి సార్—పొట్ట చేత్తో బట్టుకుని రికామీగా తిరుగుతున్నాడండి పాపం, ఆసుపత్రినించీ తోలేశార్టండి. గతిలేనమ్మకి గంజే పానకమని, ఏదో 109 కింద ఆరునెలలు వేస్తే హాయిగా సెంట్రల జెయిలులో మీపేరు జెప్పుకుని కాలక్షేపంచేస్తాడండి. అదండి వాడి ఘోష!''

'యస్సయి' నివ్వెరపోయాడు. ఇప్పు డవగాహనయింది.

''ఏమిటీ? జైలులో పెట్టమంటాడా?'' అని మహంకాళీ వంక తిరిగి

''ఏమి బావుకుంటావురా అక్కడ?'' అని నమ్మశక్యంగాక జాలిగా చూశాడు వాడివంక.

''అక్కడ అన్నం దొరుకుద్ది దొరా'' అని సారాంశం బైటపెట్టాడు మహంకాళీ.

''అన్నమా? స్రిశార్ధం! గుర్రాలు తినే తిండి పెడతారురా అక్కడ''అని బెదురుపెట్టాడు'యస్సయి.'

''గుర్రాలపాటి పెడితే మరి కావాల్సిందేటి దొరా? గుర్రాలు బలంగా లేవేట్లా? మిఠాయి ఎంత వంకరగా వున్నా తియ్యగానే వుంటది మారాజా— మెల్లిగా తింటే ముళ్ళయినా అరుగుతయి గదండీ'' అని కామవరపు జీడిలా పట్టుకున్నాడు మహంకాళీ.

ఇదో విషమ సమస్య వచ్చి పడిందే అని మథనగా వుంది 'యస్సయి'కి.

''అదికాదు.—రంగయ్యా— ఇతగాడికి కావాల్నంటే మరోవిధంగా అన్నం పెడదామంటాను వట్టి మేధకుడల్లే వున్నాడు—మన స్టేషన్లో ఉదయమూ సాయంత్రమూ ఊడవమను- డబ్బులిద్దాం సరిపోలే?'

''ఆ పనికి మన సూరిగాణ్ణి పెట్టుకున్నాం గదండీ. వీణ్ణి తెచ్చి నెత్తిన పెట్టుకుంటే వాడు గోలకెత్తడూ మధ్య?''

"కామందులు కనికరించకపోతే రెండురోజులు అల్లా అరుగు మీాదనే పండుకుని పేణం వొది లెయ్యగలను దొరా" ఉహ నిట్లా కాదని బెదిరింపులికి దిగాడు మహాంకాళీ.

"ఓరి నీ దుంపతెగా. అంతపని చెయ్యవాక. అది ఆకలిచావు కింద వస్తుంది కూడాను. మా పీకల మీాదకి తీసుకురాగలవు." జిల్లా కలక్టర్ల దాకా గంగ వెర్రులెత్తిపోయ్యేరు! ధాన్యలక్ష్మి ఓలలాడిపోయ్యే డెల్టాలో నీరసించి నీరసించి కడాపటు అథమపక్షం ఏ ధనుర్వాతమేనా వచ్చి చావాలిగాని అన్నంలేక కన్ను మూాసేందుకు వీల్లా?

"పోనీ ఏమోయ్ రంగయ్యా, పాపం, సత్ర గుమాస్తాతో చెబుదామోయ్ ఈ పెద్దాణ్ణి కాస్త కనిపెట్టమని... మనమాట తీశేస్తాడా?"

"గుమాస్తా అయినా రెండురోజులు! దాన్ని మించి చీటీ ఇవ్వడు, ఇవ్వగూడదు కదండీ."

"పాపం, ఏ నేరమూ చెయ్యకుండా వీణ్ణి ఖైదు చేయిద్దామా?

"పాపమాండి? హయ్యొ రామ! పుణ్యం సార్ పుణ్యం! ఆరునెలల అన్నదానం!!"

ఈ హేడ్డు కాలికివేస్తే వేలికీ, వేలికి వేస్తే కాలికీ పెడుతున్నాడు. అంతా తలక్రిందు వ్యవహారంగా వున్నదే అనిపించి కొత్త సబ్ఇన్స్పెక్టరు అంతరాత్మ కాస్సేపు గిలగిల కొట్టుకుంది.

"సరే ఉపకారం చేదామే అనుకో..రంగయ్యా, మరి.. ఇది జామీానుకేసు కింద వస్తుందా అని?" నాన్నాడు యస్సయి.

'సరిపోయింది! ఈ ధర్మసందేహ మొకటి మిగి లిందిగావును!' రంగయ్యహేడ్డుకి తలప్రాణం తోకకి వస్తోంది.

"రాకేమి చేస్తుంది సార్.. చూడండి..ఈగాడిద ఆ అరుగు మీాద పండుకున్నాడాండి.. ఆ గోడని, చిత్తగించారో లేదో, రెండు మేకులున్నాయండి. అవి మెల్లిగా ఊడదీసి జేబులో వేసుకుని ఏ తాళం కప్పో విడదీదామని వీడి ఎత్తండి. లేకపోతే..దాన్దుంపతెగా. ఇన్ని పంచలుండగా మేకులున్న గోడవారనే పడుకుందికి జాగా దొరికిందా వీడికి? చెప్పండి.. సందేహం లేదండి.. తమతో వీడి చరిత్ర ఇదివరకే మనవి చేశానుగదండీ, మొదట్లో అడుక్కున్నాడు—ముష్టి పడలేదు, రాయిలా వున్నాడాయిరి.. రెణ్ణాళ్ళు రోజు కూాలీ చేశాడు. తరు వాత కూాలీ పలకలేదు. తదుపరి ఆసుపత్రిలో రోగం నటించి సత్రం భోజనం మఠం నిద్రా సాగించాడు. అక్కణ్ణించీ ఉద్వాసన చెప్పారు. ఇహ నిక్కడ పడుకుని ఆలోచిస్తున్నాడండి.. ఏమనీ?..."

"వాడి ఊహలోకి దూరినట్టే చెబుతున్నావే మ రీనూ?" 'యస్సయి' పకపక నవ్వాడు.

"అద్దంలో నీడల్లే అగుపిస్తుంటే కల్పించే దేముంది సార్?"

"మరి ఏమని ఆలోచిస్తున్నా డంటావు?" ఉబుసుపోకకని ప్రశ్నించాడు, యస్సయి కొంటెగా మొహంపెట్టి:

"చెప్పమంటారా? ఎక్కడ కన్నం వేదామా అనండి.. ఇక సెక్షన్ 109 నప్పకపోవడ మేమిటండి ఖర్మ?" అని రంగయ్యహేడ్డు కంఠస్వరం తగ్గించి 'యస్స'యి చెవిలో నోరుపెట్టి—

"ఆ మాటకొస్తే నిర్భాగ్య దామోదరుడు వీడొక్కడేమిటి సార్— అదిగో ఆ లైను లైను ఆ పేవుమెంటు మీాద పండుకున్న అలగా జనమంతా ఇదే బాపతండి... వీళ్ళందరికీ కడుపే కైలాసం, నమ్మండి.. పగలు అచ్చుబోసిన ఆంబోతులల్లే వీధులంట తిరిగి ముష్టెత్తా, రాత్రిళ్ళు ఎక్కడో నడుంవార్చినట్టు నటించా— వీళ్ళంతా ఇవాళ కాక పోతే రేపనుకోండి—అంతా ఒక్కసారి బిళ్ళపెట్టుగా కాకపోతే ఒకడి తరవాత ఒకడూ అనండి—కన్నా లకీ, దొంగతనాలకీ దిగకతీరదండి. వీళ్ళు పడుకుని నిద్రపోతున్నారంటూరా? అబ్బె—కలగంటున్నారండి— ఏమనీ?—ఎక్కడ కన్నం వేదామా— ఏ గొళ్ళెం వొదులుగావుందా—ఏ తలుపు సళ్లిద్దామా—ఎక్కడ డబ్బు మాలుగుతోందా—ఏమి చేజిక్కించుకుందామా— అని ఒక్కటే రంధి! వీళ్ళందరికీ 109 టక్కున అతికిపోతుందండి......ఇంకో రెండు కేసులు పట్ట మ్మంటారా సార్.....ఎవ్వడూ అభ్యంతరం చెప్పడండి— అది రూఢే....చచ్చేవాడికి సముద్రం మోకాలిబంటి కదండీ....." వూదరగొట్టేస్తున్నాడు రంగయ్య హేడ్డు.

"మరి ఆ 'వన్ టవున్ యస్సయి' చంద్రశేఖరం 109 కింద అన్యాయంగా కేసులు పెట్టేస్తున్నాడని ఆడిపోసుకున్నాం గదుటోయ్ విన్నంతా?"

"అబ్బె—అది వేరండి.....ఆయన 'జైలు' నించీ విడుదలయి వచ్చిన పాత కేడీని బైట బ్రతకనివ్వడండి—అర్ధరాత్రి ఇళ్లపంచలని తిరుగుతున్నాడని ఏదోవంకని 109 కింద రిపోర్టు తగిలించి కటకటాలవెనక్కి మళ్లీ నెట్టేదాకా నిద్రపోతేనాండి మహారాజు. అబద్ధాల పంచాంగానికి అరవై ఘడియల త్యాజ్యమని కన్నపుకర్రా, అగ్గిపెట్టె వాడి జేబులోకన్న ముందు రిపోర్టులో ఇరికించేస్తాడండి ఆయన పగడ్బందీగా."

"అదేమిటోయ్! 109 కిందకి వచ్చేవాళ్లని చాతనైతే వేరే పట్టుకోవాలిగాని, అడివిపంది చేను మేసిపోతే, వూరపంది చెవులు కొయ్యాలా? పాపం వాళ్లు 'బయిలునించీ విడుదలయివచ్చి ఏదో ఒక జీవనోపాధి చూచుకోవాల్నా? సందివ్వకుండా అట్లా వరాసగా జైళ్లకి పట్టిస్తుంటే వాళ్ల కింక తరుణోపాయ మేముంటుంది?"

"వాళ్ల శ్రాద్ధం! ఒకసారి దొంగతనం చేసి జైలకి వెళ్లినతరవాత వాళ్లని పనిలోకెవడు పిలుస్తాడుసార్?— రెన్నాళ్లు చూచి చెయి ఝూడించడూ? పునహా వాడు ముగ్గులోకి దిగకక్రితమే మళ్లీ కటకటాల వెనక్కి నెడితే సరిపాయె!,.. ఒక్కొక్కడు సార్—గుండెలు తీసిన బంటు నమ్మండి—తమ కింకా కొత్తగానండీ... వెనక అనంతపరిలో నేను 'యస్సయి'గా కొన్నాళ్లు 'ఆక్టింగ్' వెలిగించాలెండి. అప్పుడు సత్తులనీ ఒక్క పచ్చి కేడీ వుండేవాడండి. వాడి చేవాటితనానికి తట్టుకోలేక, ఇట్లాకాదని, రేత్రిళ్లు 'పోలీస్ స్టేషను' లోనే పండుకొమ్మన్నానండి. ఇహానడిగారూ, స్టేషనికి రాత్రి వస్తానే ఒక్క పిసరు దొంగతనమూ, చెంబో చాంతాడో, స్టేషన్నించీ తెల్లారగట్ట సెలవు తీసుకొని వెడుతూనే ఒక చిన్న హస్తలాఘవమూ—చేసి మరీ చూపించేవాడు నమ్మండి—దొంగతనం జరిగినట్టు 'పోలీసు స్టేషన్లో' రిపోర్టు అందీ అందగానేన్నండి...ఆరా తీసుకుంటే వాడు 'స్టేషన్' ఆవరణలో గుర్రుపెట్టి నిద్రపోతోనేనా అవుపించేవాడు—లేదూ—వాడి ఇంటి అరగు మీద పొద్దున్న తాపీగా వేపపుల్ల నోట్లో పెట్టుకుని ముఖమార్జన చేసుకొంటోనేనా అగుపించేవాడు—సరిసరి చంద్రంగారికీ మనకీ పొసత్యమాండి? ఆయన 109 కింద కేసు దాఖలుచేస్తే గోలగోల కదండీ ముద్దాయిలు! శాపనార్థాలు పెడుతో కోర్టుకి హాజరయ్యేవాళ్లండి పాతకేడీలు. మ నం కేసుపెడితే అదోవరంకింద మహా ప్రసాదమని స్వీకరించాలిసిందేనాయిరి...సంకోచం దేనికి చెప్పండి? మహంకాళి—అన్నారమా. మంచివాడండి పాపం... అభమూ శుభమూ తెలియనివాడు—మీా పేరు చెప్పుకుంటాడు—మనకా, 109 కింద కేసులూ అమురుతాయి...పుణ్యమూ పురుషార్థమూ కలిసొస్తుందండి"

"ఏరా... జైలంటే బందిఖానాకాదుట్రా? అక్కడేమి సుఖంరా?" యస్సయి రెట్టించాడు మహంకాళీని. ఆయన గొంతులో అమాంకత్వం తొణికిసలాడింది.

వాడికిదంతా అర్థంకాక బేలగా చూస్తున్నాడు. జైలులో తిండి దొరుకుతుంది! అంతే వాడికి తెలుసు. హేడ్డుగారి తతివ్వామ్మ వాదనంతా అగమ్యగోచరంగావుంది.

'యస్సయి' నీళ్లుగారుతున్నట్టు గ్రహించి రంగయ్యహేడ్డే మళ్లీ అందుకున్నాడు.

"అట్లా అనకండిసార్— రాజాలా గడిచిపోతుందండీ సెంట్రల్ జెయిల్లో — గుడ్డివాడికన్నా ఏకాక్షి నయంకదండీ......ఇంటో దరిద్రంకన్నా అడివిలో అయిశ్వర్యం మేలని, అక్కడున్నారూ, వేళకింత తిండి పడేస్తారు. చెయ్యగలిగి నంతచేయించుకుంటారు; రేపెట్లా గడుస్తుందా అన్న బెంగలేదు. ఖైదీలకి నంబర్లుంటాయి ఏమనుకున్నారోను—ఫలానా ఖయిదీ ఎక్కడున్నాడు—ఏమి చేస్తున్నాడు.....ఎట్లావున్నాడు అన్న ఆలనా పాలనా వుండేచోటు, మనిషన్నవాడు ఒక శాల్తీకింద లెక్కకొచ్చేచోటు అదేకదండీ! జైలన్న జైలాండీ అది? కాలునొచ్చినా, కడుపునొచ్చినా నిక్షేపంగా జయిలాసుపత్రి ఉండనేవుంది! అంతేనా వాళ్లవల్ల కాకపోతే అటొక జవానూ ఇటొక జవానూ పహరాఇస్తూ పెద్దాసుపత్రికి తీసికెళ్లి ఇంజక్షను పొడిపించి మరీ

తీసుకొస్తారు. 'జైలువాన్'మీద. ఇక్కడేవుంది సార్! ఛస్తే దిక్కూ మొక్కూ? కుళ్లి కంపుకొట్టే దాకా ఏ మ్యునిసిపాలిటీ వెట్టివాడేనా దయతలిస్తే ఏమోగాని ఈడిచి పారేశేవాడు కనపడ్డు. అక్కడన్నారూ ఖైదీ ప్రాణం పోయిందీ 'జైలవార్డరు' లగాయతూ జైలు సూపరెంటు వరకూ సంజాయిషీ లొస్తాయండి మరి. ఎందుకు చచ్చాడు? ఏంచేశారు? అందాకా ఎందుకు రానిచ్చారు? లక్ష ప్రశ్నలు, యక్ష ప్రశ్నలు! ఇక్కడికివుల్లే ఏరోజు కారోజు అనుక్షణమూ అలో లక్ష్మణా, అన్నమో రామచంద్రా అంటో ముష్టికో పనికో దేవిరిస్తో ఆకలి భుజాన వేసుకుని ఇల్లిల్లాకీ తిరిగీ, వీధి వీధి గాలించ నక్కర్లేదుగదండీ? అసలు అట్టడుగు మనిషికి లాయికీ అయిన అసలయిన రామరాజ్యం అక్కడుంది కదండీ? చేతినిండా పనీ, కంటినిండా నిద్రా, కడుపు కింత పిండాకూడూ, వొంటినింత గుడ్డా, ఉండేందు కొక గూడూ, అడుగు పెట్టగానే అమర్చిపెట్టినట్టు అందివచ్చే భూలోకస్వర్గ మాయెను. ఇక్కడ సరేసరి, అడిగారూ, ముష్టి వెయ్యలేదని గృహస్తుని తిట్టా, కూలీ చాలడంలేదని యజమానిని దుయ్యబట్టా, అట్లాగని నలుగుర్నీ పోగేసుకుని ఒక్కపెట్టున సమ్మెలు చెయ్యా, పోనీ లెమ్మని జీతాలు హెచ్చిస్తే ధరలు పెరిగి పోతున్నాయో అని గోలపెడుతో అట్టముక్కలు పట్టుకుని వీధులమ్మట వూరేగా, తెల్లంగడిలో దొరకని వాటికి నల్లంగడి కెగబాకా, మళ్లీ నల్లంగళ్లు పెరిగిపోతున్నాయి మహాప్రభో అని పక్క పక్కనే అరిచి అల్లరి చెయ్యా—ఈ విషచక్రమంతా తిరక్కండా నిలిచిపోయ్యేదక్కణ్ణేకదండీ?— పెట్టేదామండి 109 కింద కేసు'' అన్నాడు రంగయ్య హేడ్డు తల ఎగరేస్తూ.

''ఓయి నీ యిల్లు బంగారంగాను— హెహారెత్తించేస్తున్నావుగదోయ్. ఇంతకీ 109 నప్పుతుం దంటావు?.......గెడ్డం తడుముకున్నాడు 'యస్సయి' మోహనరావు.

''బేషుగ్గా నండి''

పాచిక పారిందని గ్రహించాడు మహంకాళీ. ఆమట్న హేడ్డుగారి చెవిలో ''మరిగంటే, మా రాజిగాణ్ణి కూడా లాక్కురమ్మంటారా బాబయ్యా?'' అని వూదాడు సన్నగా.

''ఓరి నీ దుంపతెగా—నీ తలదూరే కన్నం లేదు తలకొక డోలా? పదపద—నీ రొట్టె నేతిలో పడిందిలే...వెధవన్నా'' అని స్టేషన్‌వేపుకి దారితీస్తో'' ''నక్క నోట్లో మట్టిగొట్టావుగదరా'' అని చేతులికి బేడీలు వేశాడు రంగయ్య హేడ్డు.

ఆ మూల నిమ్మకి నీరెత్తినట్టు కుంభకర్ణ నిద్రపోతున్న రాజిగాడివంక జాలిగా చూస్తో బ్రతుకు జీవుడా అని అడుగులో అడుగేశాడు మహంకాళీ.